RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 189 | శనివారం, 01 ఫిబ్రవరి, 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

## అందరికీ దేశాభివృద్ధి ఫలాలు



- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- “బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం.
- మా ప్రభుత్వం మూడో టెర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి దూసుకెళ్తోంది
- దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం
- అందుకే వేగంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నాం.



## వికసిత్ భారత్‌కు ఊతమిచ్చేలా బడ్జెట్

- దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్ ఉంటుంది
- 2014 తరువాత మొదటి సారిగా విదేశాల నుంచి ఎటువంటి ప్రయత్నమూ జరగలేదు
- ఈ దఫా పార్లమెంట్ సెషన్ ఒక విధంగా విశిష్టమైనది.
- ప్రతిపక్షాల తీరుపై కూడా వ్యంగ్యోక్తులు విసిరిన ప్రదాని మోడీ.
- 2047 నాటికి ‘వికసిత్ భారత్’ లక్షాన్ని సాధించడంలో కొత్త విశ్వాసాన్ని, శక్తిని ఈ బడ్జెట్ సెషన్ ఇస్తుందనే దృఢనమ్మకం



## రైతు భరోసా డబ్బులు వేయండి

- ఇది కొనసాగుతున్న పథకమే
- ఎన్నికల కోడ్ సాకుతో రైతుల పొట్టకొట్టకండి?
- కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్

ఎన్నికలు గ్రాడ్యుయేట్లు టీచర్లకే పరిమితం. రైతు భరోసాతో ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశమే లేదు. ఇప్పటికే ఏడాది రైతు భరోసా సొమ్ము ఎగొట్టారు. అసలే అన్నదాతలు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు రైతు భరోసా నిధులు రైతుల అకౌంట్స్ లో వేయాల్సిందే. రేషన్ కార్డులు అర్హులందరికీ ఇవ్వాల్సిందే నని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు కూలీల అకౌంట్స్ లో వేయాల్సిందే. ఎన్నికల కోడ్ సాకుతో ఆపితే

# నేను కొడితే మామూలుగా ఉండదు!



- గట్టిగా కొట్టడం తన అలవాటు
- గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా
- తాను ఎన్నో ప్రభుత్వాలను చూశా..
- ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చింది
- కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారు.
- కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు!

హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం తన అలవాటన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నారు గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నానన్నారు. తాన ఎన్నో ప్రభుత్వాలను చూశానని.. ఇలాంటి ప్రభుత్వాన్ని మాత్ర చూడలేదన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేక వచ్చిందని, కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్లేలా ఉన్నారన్నారు ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్

## తెలంగాణ ఆర్థిక సంక్షోభం

# ఆర్థిక ఎమర్జెన్సీ తప్పనిసరి

- రాష్ట్ర ఖజానా ఖాళీ.. ఉద్యోగుల జీతాలకూ సమస్యే..
- కార్పొరేషన్లు, రాజకీయ నియామకాలు.. ప్రజాధనం దుర్వినియోగం
- దుబారా ఖర్చులతో ప్రజాసొమ్ము దుర్వినియోగం
- పెట్టుబడుల ఆహ్వానం.. కేవలం మాటల మూటలే
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనించి, తక్షణమే ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలి
- గవర్నర్‌కు బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విజ్ఞప్తి



## ‘పేలవంగా ఉంది’

- ‘రాష్ట్రప్రతి చివరి వరకు చాలా అలసిపోయారు
- ఆమె మాట్లాడలేకపోయారు.
- రాష్ట్రపతి ప్రసంగంపై సోనియా గాంధీ వ్యాఖ్యలు
- మరోవైపు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు



# దమ్ముంటే అక్కడికి రా!



- నువ్వో నేనో చూసుకుందాం..
- ఫాంహౌస్‌లో ఉండి వచ్చిన వారికి.. సోది చెప్పడం కాదు
- కేసీఆర్ అప్పులు అప్పగించినా.. అధైర్య పడకుండా తాము పథకాలు అమలు చేస్తున్నాం
- కేసీఆర్ పెట్టిన ఇబ్బందులకు గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గుడ్డు సున్నా ఓట్లు
- రుణ మాఫీ వడ్డీలకే సరిపోయింది..

## ఉస్మానియా నూతన ఆస్పత్రికి సీఎం శంకుస్థాపన

- 2 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రి నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం.
- కొత్త ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు చేసేలా సౌకర్యాలు
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో కొత్త ఆస్పత్రికి డిజైన్
- ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు

షాద్‌నగర్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ప్రభుత్వం తమదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ఈ అంశంపై చర్చించాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం షాద్‌నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఫాంహౌస్‌లో ఉండి వచ్చిన వారికి.. సోది చెప్పడం కాదంటూ కేసీఆర్‌కు చురకలంటించారు. ధనిక రాష్ట్రమంటూ తెలంగాణను అప్పుల కుప్పగా మార్చావంటూ కేసీఆర్‌పై ఆయన నిప్పులు చెరిగారు. దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రా.. అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రుణమాఫీ చేయలేదంటున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తున్నారని.. ఆయన అసెంబ్లీకి వస్తే అందుకు సంబంధించిన లెక్కలు సైతం చెబుతానని సీఎం రేవంత్ రెడ్డి



## ఇంకా ఎంత సమయం కావాలి?

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి
- మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత
- రీజనబుల్ టైమ్ అంటే.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేవరకా?
- అంటూ తెలంగాణ స్పీకర్‌ను సూటిగా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం
- తదుపరి విచారణను వచ్చే వారానికి సుప్రీం కోర్టు వాయిదా

హైదరాబాద్

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులోశు క్రవారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జార్జి మైస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేలపై నిర్ణయం -

# దమ్మ్ముంటే అక్కడికి రా..

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. కేసీఆర్ అప్పులు అప్పగించినా.. అధైర్య పడకుండా తాము పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కేసీఆర్ పెట్టిన ఇబ్బందులకు గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గుడ్డు సున్నా ఓట్లు ఇచ్చారంటూ ఎద్దేవా చేశారు.

**హామీలు ఇచ్చి..**

పాలమూరును సైతం కేసీఆర్ ఎండబెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు బాధపడుతున్నారని కేసీఆర్ అంటున్నారని.. కానీ ఎవరూ బాధపడడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ మాదిరి హామీలను తాము ఎగ్గొట్టమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఇవ్వలేని ఉద్యోగాలను ఏడాదిలో ఇచ్చామని గుర్తు చేశారు.

రుణ మాఫీ వడ్డిలకే సరిపోయింది..

గత ప్రభుత్వం విద్యా శాఖను సైతం నిర్వీర్యం చేసిందంటూ కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పగించామని వివరించారు. ఆ ధనిక రాష్ట్రం తెలంగాణను కాస్తా అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. 2023లో తమకు రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి అప్పగించారన్నారు. గత ప్రభుత్వం రూ.18 వేల కోట్లే రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. ఇది రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందన్నారు. 60 రోజుల్లోనే రూ. 2లక్షల రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**సోషల్ మీడియాలో లైక్‌లు చూసి సంబరం..**

సోషల్ మీడియాలో తన కంటే ఎక్కువ లైక్‌లు.. వచ్చాయని కేసీఆర్ చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేంద్ర మంత్రి, సీఎంగా చేసిన వ్యక్తి.. లైక్‌లు ఎక్కువ వచ్చాయని సంబరపడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొను.. నువ్వో నేనో చూసుకుందామని కేసీఆర్‌కు స్పష్టం చేశారు. ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్‌కు.. ప్రజలతో సంబంధాలు తెగిపోయినట్లున్నాయన్నారు.

**బీఆర్ఎస్ మారలేదు...**

ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ మాత్రం మారలేదని చెప్పారు. అంతకుముందు రంగారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఆ క్రమంలో150 ఏళ్లు పూర్తి చేసుకొన్న మొగిలిగిద్ద జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొగిలిగిద్ద పాఠశాలకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఎందరో ప్రముఖులు ఈ పాఠశాల్లో చదివారని గుర్తు చేశారు. అలాగే ఈ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వం ఈ పాఠశాలను పట్టించుకోలేదని మండిపడ్డారు. మొగిలిగిద్ద పాఠశాల అభివృద్ధికి.. నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికా రులను ఆదేశించానని చెప్పారు. మొగిలిగిద్దకు సుమారు రూ.16 కోట్ల నిధులు మంజూరు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

**55 రోజుల్లోనే..**

గత ప్రభుత్వం హయాంలో టీచర్ నియామకాలు జరగలేదన్నారు. తమ ప్రభుత్వం రాగానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని వివరించారు. గతంలో నోటిఫికేషన్లు ఇస్తే ఏళ్ల తరబడి నియామక ప్రక్రియ జరిగేదన్నారు. కానీ తమ ప్రభుత్వం 55 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేసిందని గుర్తు చేశారు. ఇక గత ప్రభుత్వం యూనివర్సిటీలను సైతం నిర్లక్ష్యం చేసిందన్నారు. గత సర్కార్.. వాటిని పునరావాస కేంద్రాలుగా మార్చారని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వం రాగానే వీసీలను నియమించామని.. ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లకు పెంచామని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఖర్చు కాదు.. భవిష్యత్తుపై పెట్టుబడి..

విద్యపై చేసేది ఖర్చు కాదని.. భవిష్యత్తుపై పెట్టుబడి అని సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విద్యా శాఖ తన వద్దే ఉందని.. నిత్యం పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచ లేదన్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంచాలని.. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

మట్టిలో మాణిక్యాలు..

దేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా.. బంగారు పతకం సాధించలేదని.. కానీ దక్షిణకొరియాలో కోటి మంది ఉన్నా 32 బంగారు పతకాలు సాధించిందని గుర్తు చేశారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయడానికి.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలతోపాటు నగదు ప్రోత్సహకాలు సైతం ఇస్తున్నామన్నారు. గతంలో సమాజ సమస్యలను సైతం.. యూనివర్సిటీ విద్యార్థులు పరిష్కరించేవారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం యూనివర్సిటీలు తమ ప్రాభవాన్ని కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను సైతం బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏదైనా లోపాలుంటే సవరించుకుని తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉస్మానియా నూతన ఆస్పత్రికి సీఎం శంకుస్థాపన

**హైదరాబాద్, జనవరి 31:** నూతనంగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సీఎం భూమి పూజ చేశారు. మొత్తం 26.3 ఎకరాల విస్తీర్ణంలో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం జరుగనుంది. 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రిని నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రి నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం.

రూ.2400 కోట్లతో 14 అంతస్తుల్లో ఆస్పత్రి భవన నిర్మాణం జరుగనుంది. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 30 విభాగాలలో వైద్య సేవలు అందించనున్నారు. కొత్త ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కొత్త ఆస్పత్రికి డిజైన్ చేశారు. స్టాఫ్, మెడికల్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక భవనాలు నిర్మించనున్నారు. ప్రతీ గదిలో గాలి, వెలుతులు ఉండేలా డిజైన్లు చేశారు. అత్యాధునిక టెక్నాజీలతో కూడిన మార్చురీ ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నలువైపులా రోడ్లు వేయనున్నారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇందులో ఉండేలా ఏర్పాటు చేస్తారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులను నిర్మిస్తారు. ప్రస్తుతం అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఉస్మానియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరడంతో కొత్త ఆస్పత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించాలని నిర్ణయించారు.



ఓవర్ కాన్ఫిడెన్స్ వద్దు...

భూమి పూజ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కే కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ,రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్థిక సంక్షోభం - ఆర్థిక ఎమర్జెన్సీ తప్పనిసరి

**హైదరాబాద్ :** తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ, గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో విఫలమై, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు ఆర్థిక నిర్ణయాలు, దుబారా ఖర్చులు, రాజకీయ నియామకాలు, కోట్లాది రూపాయల ప్రజాసొమ్ముతో అడ్వర్టైజ్ మెంట్ల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, తక్షణమే రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన అవసరమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనించి, తక్షణమే ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని.. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికీ తీసుకెళ్తామని ఎన్వీఎస్ఎస్ తెలిపారు.

**రాష్ట్ర ఖజానా ఖాళీ**

**ఉద్యోగుల జీతాలకూ సమస్యే..**

రాష్ట్ర ప్రభుత్వం ఖజానా గుల్లకావడంతో ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి రాష్ట్రం చేరుకోవడమంటే ప్రమాదఘంటికలను తెలియజేస్తోంది. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈ రకమైన దిగజారిన ఆర్థిక దుస్థితి లేదన్న విషయాన్ని తెలియజేస్తున్నామని ప్రభాకర్ వెల్లడించారు. అయితే, వన్ ట్రిలియన్ వ్యవస్థ దిశగా ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. నెలవారీ అప్పుల ప్రణాళికతో ముందుకెళ్తూ, త్రైమాసికం, అర్ధవార్షికం, వార్షిక ఆదాయ వనరులను సమకూర్చుకునే విషయాన్ని కూడా పూర్తిగా గాలికొదిలేశారని ఆయన విమర్శించారు. అదేవిధంగా గత బడ్జెట్ వివరాలను గమనిస్తే.. పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం, బయట నుంచి వచ్చే అప్పులన్నీ చూసకుంటే.. నికరంగా తగ్గకుండా వచ్చేది కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న గ్రాంట్ల ద్వారానేనని పక్కాగా తెలియజేశారు. కొత్త అప్పుల కోసం బ్యాంకులను బెదిరించడం రాష్ట్ర ఆర్థిక సంక్షోభాన్ని ప్రతిబింబిస్తోంది. వివాదాల్లో ఉన్న భూములు, న్యాయ చిక్కుల్లో ఉన్న భూములను కార్పొరేషన్లకు కేటాయించి, వాటిని తనఖా పెట్టి రుణం పొందాలని చూస్తున్నారు. కార్పొరేషన్లకు కేటాయించిన భూముల ద్వారా కొత్త అప్పులు ఇవ్వకుంటే.. తమ బ్యాంకులలో ప్రభుత్వ అకౌంట్లను తప్పించి, డిపాజిట్లు తీసేస్తామని బెదిరిస్తున్నట్లుగా తెలుస్తోంది. కొత్త అప్పుల కోసం బ్యాంకుల ఉన్నతాధికారులను బెదిరింపులకు గురిచేయడం దుర్మార్గం. కార్పొరేషన్లకు కేటాయించిన భూములతో బ్యాంకులపై ఒత్తిడి తెచ్చి రుణం పొందాలనుకోవడం అనైతికమని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు.



**కార్పొరేషన్లు, రాజకీయ నియామకాలు ? ప్రజాధనం దుర్వినియోగం**

కాంగ్రెస్ ప్రభుత్వం 35 కొత్త కార్పొరేషన్లకు రాజకీయ నియామకాలు చేసింది. ఈ నియామకాల కారణంగా కొత్తగా ఆఫీసులు, సలహాదారులు, ఇతర సిబ్బంది జీతభత్యాలు, గౌరవ వేతనాలతో భారం ఖజానాపై పడింది. ప్రజాసొమ్మును దుర్వినియోగం చేయడంపైనే రాష్ట్ర ప్రభుత్వం ఆధారపడింది.

**దుబారా ఖర్చులతో ప్రజాసొమ్ము దుర్వినియోగం**

రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమం లేదా సంక్షేమ పథకాల ప్రచారానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం అనవసరం. రాష్ట్ర ఆదాయం పెరగడం లేదు, కానీ ప్రభుత్వం భారీ వ్యయాలకు పాల్పడుతోందని ఎన్వీఎస్ఎస్ మండిపడ్డారు. నెలనెలా పాలన గడవాలంటే ఎంత అప్పు చేయాలనే దానికోసం ప్రత్యేకంగా క్యాలెండర్ సిద్ధం చేసుకోవడం విచారకరం. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో తెలంగాణ రాష్ట్రం ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారే ప్రమాదం ఉంది. ధనిక రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణలో ప్రభుత్వ ఆస్తులు కరిగిపోతున్నాయి.

కాని రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రుల ఆస్తులేమో పెరిగిపోతున్నాయని ఆరోపణలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం దుబారా ఖర్చులను ఆపాలంటే, ఖజానా గుల్లకాకుండా చూడాలని, ఆదాయ వనరులను సరిగ్గా ఖర్చుపెట్టాలని, రానున్న 2-3 నెలలు చాలా క్లిష్టమైనవని ఆయన సూచించారు.

**పెట్టుబడుల ఆహ్వానం.. కేవలం మాటల మూటలే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి కొత్త పెట్టుబడుల విషయంలో వివిధ విదేశీ కంపెనీలు, సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు చెబుతున్నప్పటికీ, రాష్ట్రంలో గత ఏడాది కాలంలో ఎక్కడా కొత్త కంపెనీలు ప్రారంభించిన దాఖలాల్లేవు. కొత్త పరిశ్రమలు ఏర్పడకపోవడం ఆర్థిక విధానాల వైఫల్యాన్ని స్పష్టంగా ఎత్తిచూపుతోంది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. ఆర్థికవేత్తలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం. రాజకీయ నియామకాలను రద్దు చేసి, దుబారా ఖర్చులను ఆపాలి. తెలంగాణ ప్రజల భవిష్యత్తును కాపాడేందుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనించి, తక్షణమే ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికీ తీసుకెళ్లి, రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం, పరిస్థితులపై ఫిర్యాదు చేస్తామని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ స్పష్టం చేశారు

## రైతు భరోసా డబ్బులు వేయండి

-మొదటిపేజీ తరువాయి



ఊరుకునేది లేదు. రైతు భరోసా పథకం కొనసాగుతున్న పథకమే అయినందున ఎన్నికల సంఘం నుండి ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్నారు. పైగా జరిగే ఎన్నికలు పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించినవి అయినందును ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశాలు కూడా లేవన్నారు. అవసరమైతే బీజేపీ పక్షాన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ద్వారా ఎన్నికల సంఘానికి లేఖ పంపిందుకు కూడా సిద్ధమన్నారు. ఈ మేరకు బండి సంజయ్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తక్షణమే అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించి రైతు భరోసా సహా ఇటీవల ప్రారంభించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇండ్ల నిర్మాణ లబ్దిదారులను వెంటనే ఎంపిక చేసి మంజూరు చేయాలని కోరారు. ఒకవేళ ఎన్నికల సంఘం కోడ్ సాకుతో ఆయా పథకాలను నిలిపివేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఒకవేళ ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేస్తే అఖిలపక్షంతో కలిసి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి రైతుల ఖాతాల్లో రైతు భరోసా పైసలు జమ చేసేందుకు అనుమతి తీసుకుందామని కోరారు. ఇప్పటికే ఏడాది పాటు రైతు భరోసా పైసలు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నెలలోనైనా ప్రస్తుతం గిట్టుబాటు ధర రాక, పంట పెట్టుబడులు పెరిగి రైతులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని, ఈ తరుణంలో చేతికందే సొమ్మును కూడా ఆపేస్తే రైతు నోట్లో మట్టికొట్టినట్లే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని, వీరిలో 40 వేల మందికి మాత్రమే మంజూరు చేసి మిగిలిన 99 శాతం మంది పేదల కడుపు కొట్టడం అమానవీయమన్నారు. అట్లాగే వ్యవసాయ భూమిలేని 10 లక్షల మంది కూలీల కుటుంబాల బ్యాంకుల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం 20 వేల 336 మంది ఖాతాల్లోనే డబ్బులు జమ చేసి, మిగిలిన 9 లక్షల 79 వేల మందికిపైగా కూలీలకు జమ చేయకపోవడం అన్యాయమన్నారు. అట్లాగే రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల కోసం అందిన 70 లక్షలకు పైగా దరఖాస్తుల్లో, దాదాపు 40 లక్షల మంది పేదలు ఇండ్లకు అర్హులని తేలితే ఇప్పటి వరకు 72 వేల 406 మందికి మాత్రమే ఇండ్ల మంజూరు పత్రాలను అందజేసి, మిగిలిన వారిని ఎంపిక చేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రతి ఒక్క లబ్దిదారుడికి రైతు భరోసా సొమ్ము వేయడంతోపాటు మిగిలిన 3 పథకాలకు సంబంధించి లబ్ది చేకూర్చే ప్రక్రియను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## నేను కొడితే మామూలుగా ఉండదు!

-మొదటిపేజీ తరువాయి

మీడియాలో ఓటింగ్ పెట్టారన్నారు. ఇప్పుడే మన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని.. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని గుర్తు చేశారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే రోజుల్లో విజయం మనదేనన్నారు. మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం దిగిరాదన్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు అమాంతం పడిపోయాయని.. రాష్ట్రంలో ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మబ్బులు ఇప్పుడే తొలగిపోయి నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. మంచేదో చెడు ఏదో ప్రజలకు తెలుస్తుందన్నారు. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారన్న కేసీఆర్.. ఫామ్ హౌస్‌లో పంటలు తప్ప ఏముంటాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై అంతా అసంతృప్తే ఉందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ముంచిందన్నారు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

## ఇంకా ఎంత సమయం కావాలి?

-మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలని గత ఏడాది మార్చిలో చెప్పినా ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదని కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి.. కోర్టుకు చెప్పారు. నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ ఎమ్మెల్యేలకు తగిన సమయం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రోహత్గి గుర్తు చేశారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి... మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత? రీజనబుల్ టైమ్ అంటే.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేవరకా ?" అంటూ తెలంగాణ స్పీకర్‌ను సుప్రీం ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెపుతామని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఎంత సమయం కావాలో మీరే స్పీకర్‌ను కనుక్కొని చెప్పాలని రోహత్గికి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావుపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద ఈ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి కడియం, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావు సహా పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. దీనిపై జస్టిస్ బి ఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం విచారణ జరిపింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు తెల్లం, కడియం, దానంపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ వేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు తెలంగాణ స్పీకర్ కనీసం నోటీసు ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

## టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నయ్..!

## కాంగ్రెస్ రైతు భరోసాపై కేటీఆర్ సెటైర్లు..!

సమైక్య రాష్ట్రంలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా ఉండేవని.. బల్దియాలు అంటే ఖాయా.. పియా.. చల్దియా.. అనే సామెత ఉండేది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పని చేయాలని దిశా నిర్దేశం చేశారన్నారు. అందుకే ఆర్థిక ఇంజిన్లుగా ఉన్న పట్టణాలను, వాటిని సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. పట్టణీకరణ ఆపాలని కొన్ని దేశాలు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయన్నారు. పట్టాణాల విస్తరణ ఆపడం వీలు కాదు.. కానీ ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి మాత్రం అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆ దిశగా పదేళ్లు పనిచేశామన్నారు. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచామన్నారు. పదేళ్ల పాటు జరిగిన పట్టణాలు అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదన్నారు. పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ అవసరమైన నిధులు అందించడం తదితర నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు ఈ రోజు మోడల్ పట్టణాలుగా తయారయ్యాయన్నారు.

# విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడమే లక్ష్యం

**– చెల్లం పాండురంగారావు**





తిప్పర్తి, జనవరి 31, తెలంగాణ సేన న్యూస్: విద్య అందరికీ అందుబాటులోకి రావాలని, పేద మధ్యతరగతి విద్యార్థులు కూడా ఉన్నత విద్యకు అనుకూలంగా విద్యను అర్జించాలన్నదే పి ఆర్ ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని చైర్మన్ చల్లం పాండురంగారావు అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండలం లోని మామిడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదోవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించబడిన లాస్ట్ మినిట్ రివిజన్ బుక్ ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నిపుణుల చేత పదవ తరగతి పరీక్షల కోసం ప్రత్యేకంగా రూపొందింపజేసి ఉచితంగా పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆ పాఠశాలలో చదువుతున్న 26 మంది విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలను తమ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు కవి, గాయకులు కస్తాల వెంకన్న, ఊరుగుండ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పి ఆర్ ఆర్ సేవలు అభినందనీయం

**– డి.ఎస్.పి శివరాం రెడ్డి.**







నల్లగొండ., జనవరి 31, తెలంగాణ సేన న్యూస్: విద్య పట్ల పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని నల్లగొండ డి.ఎస్.పి శివరాంరెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలో నడుస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల మరియు కళాశాల .. అప్పాజీపేట లో జరిగిన పదోవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించబడిన లాస్ట్ మినిట్ రివిజన్ బుక్ ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నిపుణుల చేత పదవ తరగతి పరీక్షల కోసం ప్రత్యేకంగా రూపొందింపజేసి ఉచితంగా పంపిణీ చేయడం చాలా సంతోషదాయకమన్నారు. అనంతరం ఆ పాఠశాలలో చదువుతున్న 76 మంది విద్యార్థినిలకు పుస్తకాలను తమ చేతుల మీదుగా అందించారు.

ఇంతటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఇప్పటికీ విజయవంతంగా కొనసాగిస్తున్న చెల్లం పాండురంగారావును పాఠశాల తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్లయ్య, నల్లగొండ రూరల్ ఎస్సై సైదా బాబు, న్యాయవాది గుర్రం వెంకటరెడ్డి, కవి, గాయకులు కస్తాల వెంకన్న, ఊరు గుండ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయినీలు కాసాల జ్యోతి, మనో స్రవంతి, ప్రజ్ఞ, నర్మద, శైలజ, ప్యూల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరళీకృతంగా సామాన్యుల బడ్జెట్ ప్రవేశపెట్టాలి



హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుల సమస్యలను, వారి కష్ట , నష్టాలను పరిగణంలోకి తీసుకోకుండానే ప్రతి ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు, సామాన్యుల కల సొంత ఇల్లు, కుటుంబానికి భద్రత, ఉచిత నాణ్యమైన వైద్యం, ఉచిత నాణ్యమైన చదువు. కానీ కల కలగానే మిగిలిపోయేలా బడ్జెట్ లు ప్రవేశపెడుతున్నారు. రైతే రాజు, దేశానికి వెన్న ముక్క అనేది మాటలో ఉంది, చేతలో బ్రతికితే రైతుగా బ్రతకొద్దు అనేలా పరిస్థితులు మారుతున్నాయి, విద్యను వ్యాపార కేంద్రంగా మార్చడం సమస్యనులకు విద్యను దూరం చేస్తుంది. క్రీడలో ప్రోత్సహం కోసం తీసుకునే చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి, పెద్ద పెద్ద మాల్స్ కు అనుమతులు ఇవ్వడం చిరు వ్యాపారులు, మధ్య తరగతి వ్యాపారులు నష్టాలబారిన పడి దివాళా తీస్తున్నారు, కూలీలుగా మారిపోతున్నారు, మహిళల చట్టాలను కఠినం చేయడం విఫలం అవుతున్నారు, చేసిన చట్టాలను అమలు చేయడానికి సరైన ప్రణాళికలు లేకుండా చేస్తున్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదం కూడా నినాదంలానే మిగిలిపోతుంది, విద్యకు దూరం అవుతున్న చిన్నారులు ఎందరో ఉన్నారు, చర్యలు తీసుకునే చట్టాలు లేవు, వాటికోసం ప్రత్యేక శాఖలు లేవు, ప్రతి సంవత్సరం బడ్జెట్ లో అనేక వందల కోట్ల రూపాయలను రోడ్ల మరమ్మతుకు కేటాయిస్తున్నారు, కానీ ఎక్కడ కూడా పర్యవేక్షణ లేదు, నాణ్యమైన రోడ్లు లేవు, ఇప్పటికి అనేక గ్రామాలకు రోడ్లు లేవు, వైద్యం కోసం సరైన సదుపాయాలు లేవు, మరికొన్ని చోట్ల ఆసుపత్రులు నిర్మించినా సిబ్బందిని నియమించలేదు. చదువు ఉద్యోగానికి చిరునామా. కానీ చదువు నిరుద్యోగిగా మారడానికి చిరునామాగా మారింది. చదువుతో పాటు వ్యాపారం వైపు వాళ్ళ నైపుణ్యాన్ని పెంపొందించే ప్రణాళికలు లేవు, వ్యాపారం చేసుకోవానికి ప్రభుత్వాలు, బ్యాంకులు ముందుకు వచ్చి ఆర్థికంగా సహకారం అందిస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు ఎప్పటి కప్పుడు భర్తీ చేస్తే ప్రభుత్వంలో ఏళ్ళ తరబడి ఫైల్స్ పెండింగ్ ఉండే అవకాశం లేదు. దేశంలో ఆకలి చావులు పెరిగిపోతున్నాయి, ఆనాధలు, నిరాశ్రయులు పెరిగిపోతున్నారు. బాధ్యతగా ఉండాల్సిన కొందరు అధికారులు బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్నారు.

అనేక రకాల సమస్యలను సృష్టిస్తున్నారు. ఇలా అనేక రకాల సమస్యలు, అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జవాబుదారిగా ఉండి సామాన్యుల బడ్జెట్ ను ప్రవేశపెట్టాలి. సగటు సామాన్యుడు బాగునప్పుడే దేశం పురోగతివైపు పయనిస్తుంది.

# కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

**– భక్తిశ్రద్ధలతో వాసవి మాతకు అభిషేకం**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యపుకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ వాసవి మహిళా క్లబ్ వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం, భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు, మహిళలు ఏకరూప వస్త్రధారణతో ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా పూజించారు వాసవి మాత కరుణాకటాక్షాలతో అందరూ బాగుండాలని ఆర్యవైశ్య నాయకులు అమ్మవారిని వేడుకున్నామని అన్నారు అనంతరం పురోహితులు శంకర్ పంతులు ఇటీవల గజ్వేల్ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు ఆధ్వర్యంలో చిరు సన్మానం చేసి శంకర్ పంతులకు అభినందనలు తెలిపారు ప్రతినిత్యం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తు అందరి ప్రేమ అభిమానాలను పొందారని అన్నారు, వారికి వారి కుటుంబానికి ముక్కోటి దేవతల కరుణాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు, యువకులు, మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు

# పెట్టుబడులకు తెలంగాణ స్వాగత గుమ్మం

**– తెలంగాణబీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**



హైదరాబాద్, తెలంగాణ సేన: విదేశీ పెట్టుబడులకు తెలంగాణ స్వాగత గుమ్మంగా మారిందని తెలంగాణ స్టేట్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ రానున్న రోజులలో హైదరాబాద్ మహా నగరాన్ని ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రైల్ మధ్యలో రేడియల్ రోడ్లు పారిశ్రామిక క్లస్టర్లు ఇలా అనేక అంశాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దావోస్ వేదికగా ఆవిష్కరించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ 1,78,950 కోట్ల విలువచేసే పెట్టుబడులను తెలంగాణకు రావడం అంటే ఆశామాశి కాదని వీటితో దాదాపు 50 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలు లక్ష్యాలను ప్రపంచ దిగ్గజాల ముందు ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టంగా ఆవిష్కరించారని కమ్యూనికేషన్ రంగంలో శరవేగంగా వచ్చిన మార్పులను అందిపుచ్చుకోవడంలో రాజీవ్ గాంధీ సరళీకృత ఆర్థిక విధానాలతో, దేశానికి మార్గ నిర్దేశకులైన, పీవీ నరసింహారావు, అలాగే హైదరాబాదు ఐటీ రంగ విస్తరణకు చంద్రబాబు నాయుడు, తీసుకున్న చర్యలు హైదరాబాద్ ఒక మహానగరంగా విస్తరించడానికి విస్తృతమైన మౌలిక సదుపాయాలు కల్పించిన వైయస్ రాజశేఖర్ రెడ్డి లాంటి నేతలు చూపిన బాటను కొనసాగిస్తామని దేశాన్ని ఐదు ట్రిలియన్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని ప్రధానమంత్రి సంకల్పానికి తెలంగాణ వంతుగా నిలబడతామని దావోస్ లో రేవంత్ రెడ్డి స్పష్టం చేయడం స్వాగతిస్తున్నామని అన్నారు. సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ అభివృద్ధి విషయంలో ప్రపంచంలో పోటీ పడతామని రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమని అన్నారు. అది ఒక ఎత్తు అయితే మూడు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన మూడు ప్రాంతాలలో గలగల పారే కృష్ణా గోదావరి నదులతో పోలుస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలని రేవంత్ రెడ్డి అనడం ఆయన అభినందనీయులని అన్నారు.

పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక స్పీడ్ అసెట్, అని కితాబు ఇచ్చారు. ముఖ్యమంత్రి దూర దృష్టితో ప్రజా ప్రభుత్వం గత ఏడాది కాలంలో అమలు చేస్తున్న ప్రణాళికలు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగిస్తున్నాయని కొత్తగా డేటా సెంటర్లు ఏర్పాటు లేదా విస్తరణకు ఆయా సంస్థలు చొరవ చూపడానికి అది ఒక కారణం అని అన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో శరవేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అందరికన్నా ముందుగా అందిపుచ్చుకునే హైదరాబాదులో, ప్రపంచ స్థాయి సదస్సు నిర్వహించడమే కాకుండా ప్రత్యేకంగా ఏ.ఐ. సిటీ నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆ రంగంలో విస్తరించాలని సంస్థలలో విశ్వాసాన్ని పెంచిందని హైదరాబాదు కేంద్ర బిందువుగా డేటా సెంటర్లను నెలకొల్పడానికి ఐటి కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయంటే అందుకు ప్రభుత్వ ప్రోత్సాహకంగా నిలుస్తున్న తీరు ఆయా సంస్థలకు నమ్మకం కలిగిస్తుందని అన్నారు.

## పొల్యూషన్ లేని హైదరాబాద్

రానున్న రోజులలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలులో హైదరాబాద్ ముందుంటుందని ఎలాంటి వాయు కాలుష్యం లేని ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్డు టాక్స్ రిజిస్ట్రేషన్ చార్జీల మినహాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలు అందిస్తోందని ఎలక్ట్రికల్ వాహనాల అమ్మకాలు పెరగడం కాలుష్యకారక వాహనాలు తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎంతగా కట్టుబడి ఉందో అర్థం అవుతుందని, మూసి ప్రక్షాళన కూడా హైదరాబాద్ నగర భవిష్యత్తుకు ఒక బృహత్తరమైన ప్రణాళిక, అని కొందరు కావాలని కూల్చివేతలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేసినప్పటికీ మరో వంద సంవత్సరాల పాటు హైదరాబాదు కాలుష్య రహిత పర్యావరణహితమైన నగరంగా విలసిల్లాలని చేపట్టిందే మూసి పునర్జీవన కాలుష్య కాసారంగా మారిన మూసిని ప్రక్షాళన చేసి ఈ మహానగర నీటి అవసరాలను తీర్చడమే కాకుండా నల్లగొండ జిల్లా ప్రజల సాగునీరు వంటి విషయాలతో ముడిపడిన అంశంగా దావోస్ వేదికపై ముఖ్యమంత్రి వివరించడం అమోఘం అని నూతి శ్రీకాంత్ పేర్కొన్నారు. తమిళనాడులో ఆ రాష్ట్రానికి సంబంధించిన ఏదైనా ఒక సమస్య తెరమీదికి వస్తే ఆ రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ ఒకే వేదికపై వస్తాయని తెలంగాణలోనూ ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి పునర్నిర్మాణంలో కలిసి రావాలని అనుభవంతో కూడిన అభిప్రాయాలు సలహాలు సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ప్రతిసారి అంటుంటారని, ప్రపంచ పటంలో తెలంగాణ హైదరాబాద్ లు ఉండాలని అందరూ ఆకాంక్షించాలి. పెట్టుబడులు వస్తున్నాయి అంటే హర్షించాలి. పోటీ ప్రపంచంతో ఈ మాట అనాలంటే ఎంతో దూర దృష్టి ధైర్యం కావాలి. మార్గ నిర్దేశం చేసే శక్తి సామర్థ్యాలు ఉండాలి తెలంగాణ అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధించడానికి జరుగుతున్న ప్రయత్నాలను మనస్ఫూర్తిగా స్వాగతిద్దాం. "కలిసి రాని వారిని ఏం చేస్తాం వారి ఇష్టం వారు కేవలం ఫామ్ హౌస్ లకే పరిమితం". పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ మారుతున్నది. అనేదానికి మనం గర్వపడదాం. తెలంగాణ పునర్నిర్మానణికి అంకితం అవుదామని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.

# విద్యతో మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

**– సంద్రగూడెం గుత్తి కోయ గుంపు పిల్లలకు నోట్ పుస్తకాలు పంపిణీ**

**– కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదు**

**– ఎస్ఐ తాజుద్దీన్**



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ ఏటూరునాగారం : విద్యతో మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఏటూరు నాగారం ఎస్ఐ తాజుద్దీన్ అన్నారు. ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు సిఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు శుక్రవారం మండలంలోని సంద్రగూడెం గుత్తి కోయ గుంపును సందర్శించారు. గుత్తి కోయ గూడెంలో విద్యాభ్యసిస్తున్న పిల్లలకు నోట్ పుస్తకాలు పెన్నులు తిను బండారాలు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అనేది ఒక నిచ్చెన లాంటిది మనం ఎంత చదివి ముందుకు వెళుతుంటే అంత పైకి మనల్ని తీసుకెళ్తుంది నువ్వు చదివే ప్రతి పుస్తకం నీకు ఏదో ఒకటి నేర్పిస్తూనే ఉంటుంది దాన్ని నువ్వు గ్రహించినప్పుడే ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కగలవు గూడెంలో పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చదువుకోవడం వల్ల కలిగే లాభాలు గౌరవ మర్యాదలు చదువు ప్రాముఖ్యతను గుత్తి కోయ పిల్లలకు గుత్తి కోయలకు క్షుణ్ణంగా వివరించారు. గూడెంలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకొని రావాలని పోలీస్ శాఖ తరపున సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. గూడెంలో కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదు. అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్స్ సిఆర్పి ఎఫ్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టి బుదేశ్ నీ పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు


**– మెడిసిన్ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేసిన నాయకులు**

**– అధైర్య పడవద్దు కాంగ్రెస్ పార్టీ మీ వెన్నంటే అండగా ఉంటుందిఆ**



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ ఏటూరు నాగారం మండలం మల్యాల గ్రామానికి చెందిన గుత్తి కోయ దంపతులు తండ్రి అద్మారం తల్లి పాండే కుమారుడు ఎట్టి బుద్దేష్ 8 సంవత్సరాలు మల్యాల ఆశ్రమ పాఠశాలలో మూడవ తరగతి విద్యను అభ్యసిస్తున్నాడు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో ఆశ్రమ పాఠశాలలో చలిమంట వద్ద వెళ్లి ప్రమాదవశాత్తు మంటలో పడడంతో రెండు కాళ్లకు స్వల్పంగా గాయాలు ఐయ్యాయి ఈ విషయం తెలుసుకున్న మంత్రివర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూచనల మేరకు మండల అధ్యక్షులు చిటమట రఘు ఆధ్వర్యంలో మండల పార్టీ బృందం శుక్రవారం స్థానిక సామాజిక వైద్యశాలలో చికిత్స పొందుతూన్న విద్యార్థి ఎట్టి బుద్దేష్ ను పరామర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. విద్యార్థి వైద్య ఖర్చులకు 2500 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఏం అధైర్య పడకూడదు వేం అండగా ఉన్నామంటూ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఇలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే తమ సంప్రదించాలని పూర్తి సహాయ సహకారాలు కాంగ్రెస్ పార్టీ మీ వెన్నంటే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెరలాలయ, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, తెలంగాణ రవాణా ఆర్టిఏ డైరెక్టర్, బ్లాక్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్ యూత్ మండల అధ్యక్షుడు గద్దల నవీన్, యూత్ అధ్యక్షుడు బండారులక్కీ,టౌన్, కొండాయి గ్రామ కమిటీ అధ్యక్షులు ఆలం నాగార్జున బొచ్చు మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, మండల మహిళా కోఆర్డినేటర్ గీకురు భాగ్య,మండల మహిళా ప్రధాన కార్యదర్శి చిక్కుల్ల మానస, సేల్ మండల అధ్యక్షుడు చేలా వినయ్, మాజీ ఎంపీటీసీ కొప్పుల శ్రీను,మండల నాయకులు కందుకూరు రతన్, ఆలీ, కొమరం లక్షికంత బొచ్చు భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ లో వైష్ణవి ఎంటర్ప్రైజెస్ ప్రారంభం



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రోడ్డులో దర్శిని హోటల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన వైష్ణవి ఎంటర్ప్రైజెస్ ఎలక్ట్రానిక్ అండ్ హోమ్ నీడ్స్ షాప్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ప్రోప్రైటర్ విష్ణు మాట్లాడుతూ వైష్ణవి ఎంటర్ప్రైజెస్ మా వద్ద అన్ని రకాల ఎలక్ట్రానిక్ అండ్ హోం నీడ్స్ అతి తక్కువ ధరలో నాణ్యమైన వస్తువులు లభించును,వినియోగదారుల సంతృప్తి మా సంతృప్తి అని లాభాపేక్ష లేకుండా సరసమైన ధరలకు అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు అమ్మబడును అని, ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని ఒక్కసారి,షాప్ కు వచ్చి మీకు నచ్చిన వస్తువులు తక్కువ ధరలో తీసుకొని సంతోషంగా ఉండాలని కోరుకుంటూ, ఈ అవకాశాన్ని గజ్వేల్ మరియు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# అన్నప్రసాద వితరణ



సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్ : పట్నా ఆర్యవైశ్య మహాసభ ప్రెసిడెంట్ పుల్లూరి సురేష్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, మా శెట్టి ఉపేందర్, హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ప్రెసిడెంట్, పుల్లూరి సురేష్ మాట్లాడుతూ, మా వైశ్య దాతలు తేరేలా శ్రీనివాస్, తిరువేడి ప్రభాకర్, వారి సహకారంతో 300 మందికి అన్నదానం నిర్వహించాం అన్నారు, ఏ కార్యక్రమం చేసిన ప్రజలకు ఉపయోగపడ్డట్టు ఉండాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమానికి అల్లాడి హరీష్ కుమార్, ప్రొద్దటూరి వెంకటేశ్వరరావు, సేవాదళ్ చైర్మన్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ చైర్మన్ సురేష్ కుమార్, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి శుక్రవారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించడం జరిగింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఉన్నారు.

# మర్కుక్ తహసీల్దార్ ను సన్మానించి న టిఎస్ఎన్ ఫౌండేషన్ చైర్మన్ తుమ్మ గణేష్



సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల నూతన ఎమ్మార్వో గా భాద్యతలు స్వీకరించిన కాయతి ప్రవీణ్ రెడ్డిని శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన ములుగు మండల ప్రజా సేవకుడు టీఎస్ఎన్ ఫౌండేషన్ చైర్మన్ తుమ్మ గణేష్ మాట్లాడుతూ ములుగు మండలం లో ఎమ్మార్వో గా నిధులు నిర్వహించి మర్కుక్ బదిలీ అయిన ఎమ్మార్వో ప్రవీణ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగిందని ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రభుత్వ అధికారి ఎమ్మార్వో ప్రవీణ్ రెడ్డి అని అన్నారు

తెలంగాణ సేన

శనివారం, 01 ఫిబ్రవరి, 2025

# సికింద్రాబాద్ లో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలి

-వల్లారపు శ్రీనివాస్



సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్ : తెలుగుదేశం పార్టీ సీతాఫల్మండీ డివిజన్ మాజీ అధ్యక్షులు జి వి కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 20 మంది యువకులు బౌద్ధనగర్ లోని తెదేపా సికింద్రాబాద్ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ నివాసంలో ఆపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చేరిన వారిలో రాచకట్ల హరితేజ,దగుల్ల అరవింద్, సంద్రీ రాహుల్, ప్రకాష్, పులిపాటి గణేష్, సత్యవాడ శ్రీహరి, అయ్యప్ప, జాలా రాజశేఖర్, బొమ్మకంటి సందీప్ కుమార్, కే నాగేంద్ర, గోపి వంశీ,గోపి శ్రీకాంత్, జాతరకొండ అనీల్ కుమార్, సన్ని గణేష్, %వీ% అనీల్ తోపాటు మరి కొందరు తెదేపాలో చేరారు. ఈసందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి విజన్ కి ఆకర్షితులై యువత ఈరోజు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. చంద్రబాబు గారు ఎప్పటికి కోరుకొనేది ఒకటేనని, రెండు తెలుగు రాష్ట్రాలు భారతదేశం అభివృద్ధిలో ముందుండాలనేది అయన చిరకాల కోరిక అన్నారు. ప్రపంచదేశాల్లో తెలుగువారి ఘనకీర్తిని చాటేలా యువత ముందుకి సాగలాన్నారు వల్లారపు శ్రీనివాస్. ఈకార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, చిరంజీవి రాజు, శేషిరేఖ, బండి మురళి, చంద్రమోహన్, నాయుడు, పుప్పాల విజయ్, టైలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జయంతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





సనత్ నగర్, తెలంగాణ సేన జయంతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎస్ ఆర్ నగర్ పోలీసు స్టేషన్ నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయంతి హాస్పిటల్స్ ఛైర్మన్ కార్డియాలాజిస్ట్ డాక్టర్ శరత్ చంద్ర పాల్గొని ప్రజలకు హృదయ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శరత్ చంద్ర మాట్లాడుతూ ఉచిత వైద్య శిభిరాలను నిర్వహంచి ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తామని అన్నారు. ఎస్ ఆర్ నగర్ లో ప్రజలకు అందుబాటులో జయంతి హాస్పిటల్ లో నాణ్యమైన వైద్యం ను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ అమృత, డాక్టర్ రగుదీప్, ఏ సిపి వెంకటరమణ, సిఐ శ్రీధర్ రెడ్డి,ఎస్ఐ శ్రవణ్ కుమార్,ఎస్ ఐ రాజు, అఖిలా ,ఎస్ ఐ శ్రావణ్ కుమార్,ఎస్ ఐ సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ 2025 పై ఎన్నో ఆశలు

బడ్జెట్ 2025పై ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి అనేక ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. రాష్ట్రానికి ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయా అనే చర్చ పెరిగింది. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉండటంతో, గతంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది బడ్జెట్‌లో ఏపీ అమరావతి కొత్త రైల్వే లైన్‌కి కొంత నిధులు కేటాయించారు. కానీ ఈసారి మాత్రం ప్రత్యేకంగా అమరావతి రైల్వే లైన్‌కు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు పెద్ద మొత్తంలో నిధులు అవసరం. ఆ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఈ బడ్జెట్‌లో దీనికి పెద్ద నిధులు కేటాయించే అవకాశం ఉంది. అంతేకాకుండా దశాబ్దానికి పైగా పూర్తికాని కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్‌కి కూడా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది. గతంలో ఈ ప్రాజెక్టు పురోగతిని గమనించి, పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలో ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో రవాణా వ్యవస్థను మెరుగుపడనుంది. ఇప్పుడు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉండడంతో, ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో అవసరమైన ప్రాజెక్టుల పైన అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. కేంద్రంతో మంచి సంబంధాలు ఉన్న పార్టీలు, ముఖ్యంగా టీడీపీ, బీజేపీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరింత శ్రద్ధ పెడతాయన్న సంకేతాలు ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో ఇప్పటికే కొన్ని కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు అంచనాలు ఉన్నాయి. దీంతో రాష్ట్రానికి మరింత అభివృద్ధి, ఆర్థిక సవాళ్ల నుంచి ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఈరోజు ఏపీకి ఈ బడ్జెట్ నుంచి ఎంత ప్రయోజనం కలగుతుందో అనేది ఓ వైపు రాజకీయంగా, మరోవైపు ఆర్థిక రంగాలలో ఆసక్తిని పుట్టించే అంశంగా నిలిచింది.

# ఏపీలో పెరిగిన భూముల విలువ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువ సవరణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 16,997 గ్రామాల్లో భూముల విలువ సవరణ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో భూముల మార్కెట్ విలువ సవరణపై కొన్ని నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు తాజాగా సవరణ చేస్తూ రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ప్రకటన జారీ చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 16,997 గ్రామాల్లో 9,054 వార్డుల్లో భూముల విలువ సవరణ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. 68 గ్రామాలకు సంబంధించి ఎలాంటి మార్పులు, చేర్పులు చేయలేదు. 158 గ్రామాలు, 145 వార్డుల్లో భూములు విలువ తగ్గించినట్లు రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ తెలిపింది. అలాగే మార్కెట్ విలువల్లో మార్పులకు సంబంధించి **registration.ap.gov.in** వెబ్ సైట్‌లో ఇవాళ (శనివారం) ఉదయం 10 గంటల నుంచి వివరాలు అందుబాటులో ఉంటాయని చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా జాయింట్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు ఆధ్వర్యంలోని కమిటీలు ప్రజల నుంచి ఇప్పటికే అభ్యంతరాలు స్వీకరించినట్లు పేర్కొంది. వాటిని పరిగణనలోకి తీసుకుని మార్కెట్ వాల్యూను రివైజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన మార్కెట్ విలువలు అమలులోకి వస్తాయని చెప్పింది.

# ఘోర ప్రమాదం

గుంటూరు: జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. కుర్నూతల గ్రామానికి జూటూరి దావీదు రాజు(18), మేడాల గోవర్ధన్(18) ఓ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ఐపీడీ కాలనీకి చెందిన నల్లదీపి బలరాం(22) మరో బైక్‌పై వెళ్తున్నాడు. అయితే వీరంతా ఏటుకూరు సమీపానికి రాగానే ప్రమాదవశాత్తూ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన ఇతర వాహనదారులు సమాచారాన్ని పోలీసులు, 108కు అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో వారిని జీజీహెచ్‌కు తరలించే లోపే ముగ్గురు యువకులూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబాలు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీటి పర్యంతం అయ్యారు. చేతికొచ్చిన కుమారులు మృతిచెందడంతో గుండెలు పగిలేలా రోదించారు. యువకుల మృతితో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సినిమా డైలాగులు వద్దు అసెంబ్లీకి రా లెక్కలు చెప్తాం: సీఎం రేవంత్ రెడ్డి



రంగారెడ్డి, తెలంగాణ సేన న్యూస్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్ణయాలను విమర్శించారు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ, తెలంగాణను అప్పుల గడ్డకెక్కించినట్లు ధ్వజమెత్తారు. 2023లో మా వద్దకి రూ. 7 లక్షల కోట్లు అప్పు చేయడంతో వచ్చిన తెలంగాణ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ. 18వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేసింది. ఈ రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. సినిమా డైలాగులు వద్దు కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుదామని అనుకుంటే,ఆయన ఫామ్‌హౌస్‌లో ఉండి సోది మాట్లాడటం కాదు, నిజంగా నీకు గట్టిగా కొట్టే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి రైతులకు ఎన్ని రుణమాఫీలు చేశామో అసెంబ్లీ ముందు వివరంగా చెప్పాలని అన్నారు. కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. దళితుల కోసం 3 ఎకరాల భూమి, దళిత సీఎం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి హామీలను ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్ కు ఉంటే, అది ప్రజల్ని మోసం చేయడమే అని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. పదేళ్ల పాటు పాలించిన కేసీఆర్, ప్రజల నుంచి తప్పించి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టుల గురించి హామీ ఇచ్చి, స్వంత ప్రాజెక్టులలో రుణాలు చెయ్యడమే అన్యాయంగా ఉందన్నారు. అంతేకాకుండా..'అసెంబ్లీ ఎన్నికలను అడ్డు పెట్టుకుని రైతు బంధు ఎగ్గొట్టిన చరిత్ర కేసీఆర్‌ది. ఆయన ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులను మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఖాతాలో వేశాం. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు కేసీఆర్ చేసిన రైతు రుణమాఫీ కేవలం రూ. 18వేల కోట్లు మాత్రమేనని,అన్నారు ఇందులో మిత్తికి పోగా నికరంగా ఆయన చేసిన రుణమాఫీ కేవలం రూ. 3 వేల కోట్లు మాత్రమే. కానీ మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 21వేల కోట్లు రుణమాఫీ చేశాం. మేం రుణమాఫీ చేయలేదంటు న్న కేసీఆర్ ఫాం హౌస్ కు వచ్చినోళ్లకు చోద్యం చెప్పుడు కాదు.. అసెంబ్లీకి రా లెక్కలు చెబుతాం.. రైతుల జాబితాతో సహా మేం చేసిన రుణమాఫీ లెక్కలు చూపిస్తాం.. నీకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రా.. నీలా ఇచ్చిన హామీ లను ఎగ్గొట్టి పంగనామాలు పెట్టిన చరిత్ర నాది కాదు..

# బీసీలకు కేంద్ర బడ్జెట్లో లక్షకోట్లు కేటాయించాలి

- బీసీ బ్యాంకు ఏర్పాటు చేసి ఆర్థిక చేయూతనివ్వాలి
- ఎంపీ, ఎమ్మెల్యే రిజర్వుడు స్థానాలు కల్పించాలి
- కేంద్రంలో బీసీలకు మంత్రిత్వశాఖ కేటాయించాలి
- దేశవ్యాప్త కులగణ చేపట్టాలి,
- బీసీ అట్రాసిటీ యాక్ట్ ను అమలు చేయాలి.
- గుజరాతీ భాషలో మోడీజీకి విజ్ఞప్తి.
- శంతన్ రామరాజు,
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ.



మహబుబాబాద్ టౌన్ తెలంగాణ సేన కేంద్ర బడ్జెట్లో బీసీలకు లక్షకోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి శంతన్ రామరాజు గుజరాతీ భాషలో ప్రధానమంత్రి నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు. నేటినుండి కేంద్ర ఆర్థిక బడ్జెట్ మొదటి సెషన్ సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కోఆర్డినేటర్ కమ్మగాని కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో శంతన్ రామరాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో సగానికిపైగా ఉండి ఉత్పత్తిశ్రేణి వర్గాలుగా దేశ రాష్ట్ర ఆర్థిక రంగానికి వెన్నెముక గా ఉన్న బీసీలు అన్నిరంగాల్లో వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న ప్రభుత్వాలు ఇకనైనా కళ్ళు తెరవాలన్నారు. ఈబడ్జెట్ సమావేశాల్లోనే బీసీలకు లక్షకోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ బ్యాంకు ఏర్పాటు చేసి యువతకు ఉపాధికల్పనకై ఆర్థిక తోడ్పాటు అందించాలని సూచించారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలైనా కేంద్రంలో బీసీలకు ఓమంత్రిత్వ శాఖ లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈలోటును తక్షణమే పూరించి బీసీల అభ్యున్నతికి పాటుపడాల్సిన బాధ్యత బీసీ ప్రధానమంత్రిదని అన్నారు. అదేవిధంగా బీసీలకు చట్టసభల్లో ఎంపీ, ఎమ్మెల్యే రిజర్వుడు సీట్లను కేటాయించే విధంగా ప్రభుత్వం ముందుకుపోవాలన్నారు దేశవ్యాప్త కులగణన ద్వారా బీసీల వాటా తేల్చాలన్నారు. బీసీ అట్రాసిటీ చట్టం అమలుచేసి బీసీ కులాల ఆత్మగౌరవాన్ని పెయించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీకు అన్ని హక్కులు కల్పించాలని అన్నారు. విద్య, వైద్య, ఉపాధి, రాజకీయ, పదోన్నతుల్లో బీసీలు తీవ్ర అసమనతలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీల ప్రధానమంత్రి అయినా బీసీలకు సరైన న్యాయం చెయ్యలేక పోవడం దురదృష్టకరమని వాపోయారు. అందుకే ప్రధానికి అర్థమయ్యేలా గుజరాతీ భాషలో బీసీల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. ఏదేమైనా బీసీలు తమ హక్కుల సాధనలో ఐక్యతతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీలు ఒకరికొకరు సహకరించుకొని విజయం సాధించాలని హితవుపలికారు ఇంకా ఈకార్యక్రమంలో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు నాలమాస సాయి, విద్యార్థి సంఘ నాయకులు చిత్తారి సోమన్న, జర్నలిస్ట్ నాయకులు దొంతు పురుషోత్తం నేత, కొండి సాయికిరణ్ నేత, కాంగ్రెస్ యువ నాయకులు గంద్రాతి మల్లేష్, ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు జక్క శంతన్, గుంజె హనుమంతు, గంగాదరి బాలరాజు, అల్వాల లాలయ్య, తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్యజిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన..



చంద్రబాబు ఈ పర్యటనలో కేవలం పింఛన్ల పంపిణీ మాత్రమే కాకుండా, రోడ్డు నిర్మాణం, నీటి సరఫరా, విద్యుత్ సమస్యల పరిష్కారం వంటి పలు అభివృద్ధి పనులను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలోని సంబేపల్లె ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఫలితాలు సాధించిన ప్రాంతాలలో ఒకటిగా కనిపిస్తోంది. పథకాలు సమర్థవంతంగా అమలుచేసి, ప్రజల జీవితాలను సులభతరం చేసే ప్రతిపాదనలు ఇక్కడ చర్చించనున్నారు. ఈ రోజు సాయంత్రం, సీఎం చంద్రబాబు రాయచోటి నియోజకవర్గంలోని ప్రజలతో సమావేశ సమావేశంలో కూడా పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ప్రజలు తమ సమస్యలను, అభిప్రాయాలను ముఖ్యమంత్రికి ప్రస్తావించే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో చంద్రబాబు, వారికి ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే లాభాలను వివరించనున్నారు. రాయచోటి నియోజకవర్గం ముఖ్యమంత్రి పర్యటనలలో ఒక ప్రత్యేక స్థానం కలిగిన ప్రాంతమని చెప్పవచ్చు. ఇక్కడ జాతీయ సంక్షేమ పథకాల అమలు, పేదలకు సంక్షేమం, నిరుపేద కుటుంబాలకు సంక్షేమ చర్యలు చేపట్టడం వంటి అంశాలు ఎక్కువగా కనిపించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విలీనం తర్వాత చంద్రబాబునాయుడే ఈ ప్రాంతంలో ప్రగతికి అండగా నిలిచారు.

పేదలకు పింఛన్లు, మహిళలకు రుణాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి పనుల ద్వారా అనేక మంది బలహీన వర్గాల ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పర్యటనలో ఈ కృషి మరింత సాంఘిక అంశాలుగా అభివృద్ధి చెందాలని ఆయన ఆశిస్తున్నారు. ఈ పర్యటన అనంతరం రాయచోటి నియోజకవర్గంలోని ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, వ్యవసాయ రంగంలో మరింత ప్రోత్సాహం, ఆర్థిక సహాయం అందే అవకాశం ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

# తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జఖీ యుద్దీన్ ను సన్మానించిన మాజీ మంత్రి కేటీఆర్



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పదవీకాలం ఐదు సంవత్సరాలు విజయవంతంగా ఇటీవల పూర్తయిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన అభినందన సభలో మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జకియుద్దిన్ ను ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి కేటీఆర్, అనంతరం తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జఖీయుద్ధీన్ మాట్లాడుతూ, నాకు అవకాశం కల్పించిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రజలకు రుణపడి ఉంటా అని నాకు సన్మానం చేసిన కేటీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, మెదక్ మాజీ శాసన సభ్యురాలు పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎఫ్ డీ సీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తోటి కార్మికుని దహన సంస్కరణకు సహకారం



కొమ్మ్ముగూడెం, తెలంగాణ సేన న్యూస్ : తోటి కార్మికుడైన చిట్యాల తరుణ్ కుమార్ అమరుడైన సందర్భంలో వారి స్వగృహం అయినటువంటి కొమ్మ్ముగూడెం లో దహన సంస్కరణనికి మున్సిపల్ ఇన్స్పెక్టర్ ఉదయ్ కిరణ్ మరియు వైకుంఠం మున్సిపల్ ఆఫీసు నుండి 10000 రూపాయలు,తెలంగాణ మున్సిపల్ కాంటాక్ట్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు దేవి సత్యం పెద్ద మొత్తంలో కార్మికులు పాల్గొని వారి కుటుంబ సభ్యులకు పదివేల రూపాయలు అందజేయడం జరిగినది.

# శాశ్వత రిజిస్ట్రేషన్'పై చల్లారని రగడ!



అమరావతి, జనవరి 31 విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించిన విద్యార్థులు, ఏపీ మెడికల్ కౌన్సిల్(ఏపీఎంసీ) మధ్య వివాదం సీఎం చంద్రబాబు వద్దకు చేరింది. తమకు ఏపీఎంసీ శాశ్వత రిజిస్ట్రేషన్లు చేయ ట్లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అయితే నేషనల్ మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంటామని ఏపీఎంసీ, ఎన్టీ ఆర్ హెల్త్ వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కొంతమంది విద్యార్థులు సీఎం చంద్రబాబును కలిసి, సమస్యలను వివరించారు. వారి సమస్యలను విన్న సీఎం.. విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కొవిడ్‌తో పాటు రష్యా, ఉక్రెయిన్ యు ద్ధం కారణంగా కొంతమంది వైద్య విద్యార్థులు కోర్సు మధ్యలోనే స్వదేశానికి తిరిగొచ్చారు. మిగిలిన కోర్సును ఆన్‌లైన్‌లో పూర్తిచేశారు. నిబంధనల ప్రకా రం విదేశాల్లో వైద్య విద్య అభ్యసించినవారు భారత్‌లో ఇంటర్న్‌షిప్, పీజీ కోర్సుల్లో చేరాలంటే ప్రత్యేక పరీక్షలో అర్హత సాధించాలి. అయితే కొవిడ్, యుద్ధం ప్రత్యేక పరిస్థితులు కావడంతో వీరికోసం 2023 నవంబరు 22న ఎన్ఎంసీ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. చివరి ఏడాది ఆన్‌లైన్‌లో వైద్య విద్య చదివినవారు ఆయా రాష్ట్రాల్లో రెండేళ్ల పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని నిబంధన విధించింది. ఈ మేరకు ఏపీఎంసీ అధికారులు విద్యార్థులకు లేఖ ద్వారా స్పష్టత ఇచ్చారు. అయితే ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన తర్వాత శాశ్వత రిజిస్ట్రేషన్ ఇవ్వాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇంటర్న్‌షిప్‌లో ఉన్న విద్యార్థులు ఎన్ఎంసీ నిబం ధనలు పాటించడానికి నిరాకరిస్తూ, తాము చదువుకున్న విదేశీ వర్సిటీల నుంచి తెచ్చిన కాంపెన్సేటరీ లేఖలు అంగీకరించాలని కోరుతున్నారు. అయితే ఆ లేఖల్లో వారు కోర్సులు పూర్తిచేసినట్లు స్పష్టంగా పొందు పరచలేదు. దీంతో విద్యార్థులకు శాశ్వత రిజస్ట్రేషన్లకు ఎన్ఎంసీ ఆంగీకరించడం లేదు.